# కడెం ప్రాజెక్టుకు శాశ్వత పరిష్కారం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు
- మండల సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం, డిసెంబర్ 13 : కడెం ప్రాజెక్టుకు శాశ్వత పరిష్కారం చేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పేర్కొన్నారు. బుధవారం కడెంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆంథోని అలెగ్జాండర్ అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రత్యేకంగా నిధులు తీసుకొస్తానని, కుడి, ఎడమ కాలువల మరమ్మతు, సదర్మాట్, డీ 27, 28 కాలువల ఆధునీకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరవుతున్నారని, అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. కడెం 30 పడకల దవాఖానరకు 24 గంటల పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులను తిరిగి ఇక్కడే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటి విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా అటవీశాఖ అధికారులు గిరిజన గ్రామాలతోపాటు, కొన్ని గ్రామాలకు రోడ్ల అనుమతులు నిలిపివేస్తున్న కారణంగా అనేక గ్రామాలు నేటికి వెనుకబడి ఉన్నాయని, కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయకుండా అటవీశాఖ వారు నిబంధనలు పెట్టిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడారు. అలాగే రాంపూర్, మైసంపేట గ్రామాలకు అటవీ శాఖ ఆధ్వర్యంలో పునరావాసం కల్పించినట్లు ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే బొజ్జును సన్మానించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీవో ఉపేందర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు రఫీక్ హైమద్, ఆత్మ చైర్మన్ కానూరి సతీశ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులున్నారు.


హాజరైన సభ్యులు


తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

## ఆటో డ్రైవర్లను సర్కారు ఆదుకోవాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్ 13 : ప్రభుత్వం మహిళల కోసం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో తాము రోజువారీ ఉపాధి కోల్పోతున్నామని ఆటో డ్రైవర్లు విద్యా సాగర్, లక్ష్మణ్, భారత్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆటోలకు గిరాకీ లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో బంధు పథకం కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసం

సారంగాపూర్, నవంబర్ 13 : మండల ఎంపీటీసీలు బుధవారం ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ పాతాని రాధపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇందులో తొమ్మిది మంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆర్డీవో రత్నకల్యాణికి సంతకాలు చేసిన కాపీని అందజేశారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులను క్యాంపుకు తరలించారు.

**ఎంపీపీ రాజీనామా..**

ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి బుధవారం పదవికి రాజీనామా చేసి జడ్పీ ఇన్‌చార్జి సీఈవో శంకర్‌కు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతోనే పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

**ఇన్‌చార్జి ఎంపీపీగా పతాని రాధ..**

సారంగాపూర్ ఇన్‌చార్జి ఎంపీపీగా ఆలూర్ గ్రామానికి చెందిన పతాని రాధ నియమితులయ్యారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టారు.



సభ్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

## కోరం లేక మండల సమావేశం వాయిదా

సారంగాపూర్, నవంబర్ 13 : మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరగాల్సిన మండల సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీవో సరోజ తెలిపారు. మండలంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. అయితే సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా పొట్యా ఎంపీటీసీ రాథోడ్ మీరాబాయి, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఇస్మాల్ మాత్రమే హాజరయ్యారు. మిగతా ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో చెప్పారు.

## నర్సరీ పనులను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి

దస్తురాబాద్, డిసెంబర్ 13 : రానున్న హరితహారం కోసం ఏర్పాటు చేసిన నర్సరీల పనులను వేగ వంతం చేయాలని ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశం చారు. ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత అధికారులు, ఫీల్డ్ అసి స్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశం నిర్వ హించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాగ్‌ల్లో మట్టి నింపే పనులను పూర్తి చేసి విత్తనాలను పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్ కుమార్, ఏపీవో రవి ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 13 : గ్రామీణ తపాలా ఉద్యోగులు తమ డిమాండ్లను నెర వేర్చాలని నిరవధిక సమ్మె చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను కల్పించాలని కోరారు. 5 లక్షల చొప్పున గ్రూపు బీమా వర్తింపజేయాలని, తమ కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, కమిషన్ పద్ధతిని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్‌రావు, విజయ్‌కుమార్, సందీప్, సాజిత్, వీరేందర్, రమేశ్, శ్యాం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈవో తిరుపతి

దస్తురాబాద్, డిసెంబర్ 13 : అర్హులైన రైతులు రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని దస్తురాబాద్ క్లస్టర్ ఏఈవో జాడి తిరుపతి సూచించారు. బుధవారం అర్హులైన రైతుల నుంచి ఏఈవో కార్యాలయంలో ఆయన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిలో పోర్టల్‌లో కొత్తగా పట్టా చేసుకున్న రైతులు అర్హులని, ఏఈవోల వద్ద రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు దరఖాస్తు ఫారానికి జత చేసిన వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. కాగా మండలంలో దస్తురాబాద్ క్లస్టర్‌లో 40, రేవోజీపేట క్లస్టర్లలో 30 మంది రైతులకు కొత్తగా పట్టా పాసు బుక్కులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతికి కృషి చేయాలి

కుభీర్, డిసెంబర్ 13 : మండలంలోని 41 జీపీల్లో నర్సరీల నిర్వహణ, చెత్త సేకరణ, మురుగు కాల్వల నిర్వహణ లాంటి పల్లె ప్రగతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్పీవో శివ కృష్ణ సూచించారు. కుభీర్‌లో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన హాజరై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఏపీవో హరిలాల్ పాల్గొన్నారు.

## నోటు బుక్కుల పంపిణీ

పెంబి, డిసెంబర్ 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోటు బుక్కులను పంపిణీ చేశారు. పెంబి ప్రభుత్వ పాఠశాలలో పలు సబ్జెక్టులకు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు సరైన విద్య అందడంలేదని ప్రధానోపాధ్యాయుడు గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రైవేటు ఉపాధ్యాయుల నియామకం కోసం మండల కేంద్రానికి చెందిన పుప్పాల శంకర్, బడుగు మల్లేశ్, గన్నారపు సురేశ్, మనోహర్, పీ లక్ష్మీనారాయణ, వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ ముందుకొచ్చి ప్రతి నెలా ప్రైవేటు ఉపాధ్యాయులకు వేతనం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఉపాధ్యాయులు వీరిని అభినందించారు. ఉపసర్పంచ్ సప్పిల్ రెడ్డి, కోఆప్షన్ మతీన్, తులాల శంకర్, సదానందం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వినతి పత్రం అందజేత

కుభీర్, డిసెంబర్ 13 : కుభీర్‌కు చెందిన సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల ప్రతినిధి సాప పండరి స్థానిక తహసీల్దార్ సోముకు బుధవారం వినతి పత్రం అందజేశారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే సామాన్యులకు త్వరగా పనులు జరిగేలా చూడాలని, సిబ్బంది చేతివాటాన్ని నివారించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.